క్లుప్తంగా

బీఆర్‌ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల: ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ఎంతో గొప్పదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్వీ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో విద్యార్థులకే భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దావ వసంత, ఓరుగంటి రమణరావు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ప్రదర్శనకు జగిత్యాల వాసి పెయింటింగ్



అశోక్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

జగిత్యాల: క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన మాస్టర్ స్ట్రోక్స్ సబ్జెక్ట్‌లో హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజ్‌లో నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన జరిగింది. కాగా, జగిత్యాలకు చెందిన భోగ అశోక్ వేసిన అక్రిలిక్స్ పెయింటింగ్ ఇందులో ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఫైన్స్ ఆర్ట్స్ ఉప కులపతి ప్రొఫెసర్ గంగాధర్, ప్రముఖ చిత్రకారుడు ఉదయ్‌కుమార్ అతన్ని అభినందించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్ ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: రానున్న ఎంపీటీసీ, జేడ్పీటీసీ ఎన్నికలకు మండలంలోని పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం పరిశీలించారు. మండలంలోని 17 గ్రామాల్లో 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, టాయిలెట్లు, మంచి నీటి వసతి, వికలాంగులు ఓటు వేసేందుకు గాను ర్యాంపులు మొదలైనవి ఏ విధంగా ఉన్నాయి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మండల పరిషత్ కార్యాలయంలో సామగ్రిని సిద్ధం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరిత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



శెకెల్లలో ప్రచారం చేస్తున్న సభ్యులు

బుగ్గారం: త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని శెకెల్లలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇంటింటా తిరుగుతూ మాఘ మాసంలో వచ్చే పూర్ణిమ, శివరాత్రి పండుగ, పూజలు, వ్రతాల విశిష్టతను వివరించారు. ఆచార్య ప్రబోధానంద బోధనలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట, కొడిమ్యాల మండలాల కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన రత్నాపూర్ మల్లికార్జునుడు



ముస్తాబైన మల్లికార్జునస్వామి ఆలయం



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు (ఫైల్)

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్ గుట్టపై వెలిసిన శ్రీమల్లికార్జున స్వామివారి ఆలయాన్ని జాతర ఉత్సవాలకు ముస్తాబు చేశారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. ఈనెల 11న ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పల్లకీసేవ, ఒగ్గుకథ, 12న స్వామివారి కల్యాణం, బోనాలు, 13న రథోత్సవం, 14న అగ్నిగుండాలు, నాగవెల్లి, 15న హోమం, పూర్ణాహుతి, అన్నదానం నిర్వహించనున్నారు. స్వామివారిని రత్నాపూర్ ప్రజలు అత్యంత నిష్టతో కొలుస్తారు. శ్రావణం, కార్తీక(షష్ఠి)మాసాల్లో ఇక్కడి ప్రజలు మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. అలాగే ప్రతి ఆదివారం కూడా గ్రామస్తులెవరూ మద్యం, మాంసం ముట్టుకోరు. జాతరకు ముందు ఇంటికొకరు చొప్పున మొగిలిపేటలో గల గోదావరి నదికి కాలినడకన వెళ్లి స్నానం చేసి బిందెలో జలాలు తీసుకొచ్చి స్వామివారికి అభిషేం చేయడం ఆనవాయితీ. భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ చైర్మన్ కూచన్‌పెల్లి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు కుదకల శివకుమార్ తెలిపారు.

కనుల పండువగా నృసింహుని కల్యాణం

జగిత్యాల: కొడిమ్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా నివేదన బలి హారణము, సేవా కాలం కార్యక్రమాలు చేశారు. ఈవో వెంకన్న, అర్చకులు మండల ప్రజలు పాల్గొన్నారు. ఈనెల 12న స్వామివారి రథోత్సవం ఉంటుందని భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జాతర

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఊరేగించి, ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపించారు. గ్రామస్తులే పెళ్లి పెద్దలుగా సాంప్రదాయబద్ధంగా కల్యాణం చేశారు. అనంతరం భక్తులు ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

జాతర ఉత్సవాలకు మల్లన్న స్వామి ఆలయం ముస్తాబు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామాల్లో బుధవారం నుంచి మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి రోజున స్వామివారిని వీరన్న గుట్ట నుంచి , తలంబ్రాలను పల్లకిలో ఊరేగింపుగా దేవస్థానాలను తీసుకవచ్చి, మండలమ్మ, కేతమ్మలతో కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 13న అన్న ప్రసాదం, 14న ఒగ్గు కళాకారులతో కథ, అగ్నిగుండాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

సారంగాపూర్: బీర్‌పూర్ పరిధిలోని ఆసునూరిగూడెంలో సోమవారం ఆదివాసీల గాందారి ఖిల్లా మైసమ్మ మహాజాతర పోస్టర్‌ను గిరిజన నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఆసునూరిగూడెం ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14,15,16 తేదీల్లో మందమర్రి మండలం బొక్కలగుట్ట పరిధిలోని గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు సబ్బండ వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బద్ధి గంగాదర్, ఆసునూరి నర్సయ్య, ఆరె స్వామి, బట్టపెల్లి రవీందర్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలోని శ్రీ కోటిలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం కడకుంట్ల అంజయ్య సోమవారం రూ.51,116ల విరాళం అందించారు. ఈ సందర్భంగా వీడీసీ చైర్మన్ ఎండీ.మహబుబ్‌ఖాన్, సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కడకుంట్ల అంజయ్యను ఘనంగా సన్మానించి స్వామి వారి చిత్ర పటం, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల: పట్టణ శివారులోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప, జ్ఞాన సరస్వతీ ఆలయ 21 వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణానికి చెందిన శృతి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యేను సంప్రదించగా, సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల విలువ గల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఖబ్రస్తాన్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఖబ్రస్తాన్‌లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఎంఐఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఖబ్రస్తాన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని, మరో చోటకు మార్చేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఐఎం అధ్యక్షుడు యూనస్, నదీమ్ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, చంద్రమౌళి, రవి పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రం ప్రారంభం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన దివ్య నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రారంభించారు.

పారిశుధ్యంపై కళాజాత బృందాల అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోరుట్ల రూరల్: గ్రామాల్లో పారిశుధ్యం, డ్రగ్స్ నివారణ తదితర అంశాలపై ప్రభుత్వ కళాజాత బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు సోమవారం కళాజాత బృందం మండలంలోని మోహన్‌రావుపేటలో గ్రామస్తులకు పారిశుధ్యం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రామ పంచాయతీ బండికి ఇవ్వటం, గ్రామంలో డ్రగ్స్ నిషేధం తదితర అంశాలపై కళాజాత బృందాలు పాటల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సన్నాహక సమావేశం

మెట్‌పల్లిరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలపై మెట్‌పల్లి మండల బీజేపీ నాయకులు సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారంగురించి చర్చించారు. బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని పలువురు నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి,నాయకులు జనార్దన్‌రెడ్డి,శ్రీధర్,భూమన్న, వెంకటేశ్, రాజేందర్, రమేశ్, సురేశ్,దినేశ్, రాజశేఖర్,గంగాధర్,వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల: దుకాణాలు, హోటళ్ల,స్వీట్ హౌజ్‌ల్లో మున్సిపల్ సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న దుకాణదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, జగదీశ్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడితోటల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్: మామిడితోటల సాగు, సస్యరక్షణపై సోమవారం మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు స్వాతి, బలరాం మాట్లాడుతూ మామిడితోటల్లో బూడిద తెగులు నివారణ, పిందె దశలో సక్రమంగా నీటి తడులు అందించే విధానాలు వివరించారు.

కలెక్టర్‌కు వినతి

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లో 60 శాతం మంది బీసీలు ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘం నాయకులు గరిపెల్లి శ్రీనివాస్, వంగ మల్లయ్య నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అర్చకులపై దాడి దురదృష్టకరం



తహసీల్ చౌరస్తాలో ఆందోళన వ్యక్తం చేస్తున్న భారత సురక్ష సమితి నాయకులు

జగిత్యాల: చిలుకూరి బాలాజీ టెంపుల్ ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి దురదృష్టకరమని భారత సురక్ష సమితి నాయకులు అన్నారు. సోమవారం తహసీల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైవ సేవలో నిమగ్నమైన రంగరాజన్‌ను బెదిరించి దాడిచేయడం అమానుషమన్నారు. నింధితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ,గంగాధర్,పోచమల్లు పాల్గొన్నారు.

గీత కార్మికులకు టాపింగ్ టెస్ట్

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, యామాపూర్, డబ్బా గ్రామాల్లో గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం గుర్తింపు కార్డుల కోసం టాపింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 9 మంది గీత కార్మికులు తమ ప్రతిభను చూపించారు. గుర్తింపు కార్డులు లేకుంటే సంఘ అధ్యక్షులను కలిసి కార్డులు పొందాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు సుభాష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జోగేశ్వర్ గౌడ్, చెట్ల శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, కట్ట పెద్దల నర్సయ్య, కట్ట రవి, భూసగిరి శ్రీనివాస్‌గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురికినీరు..

రాయికల్: మండలంలోని మూటపల్లిలో డ్రైయినేజీ అస్తవ్యస్తంగా మారి మురికినీరంతా రోడ్లపైకి ప్రవహించడంతో వాహనదారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మురికికాలువలోని చెత్తాచెదారం తొలగించకపోవడంతో ఇళ్లలోకి సైతం మురికినీరు వస్తుందని, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్యదర్శి స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: దేవదాస్
పంచాయతీ కార్యదర్శి, మూటపల్లి , సెల్ నంబర్: 9398261029

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

బీసీలకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం

మల్లాపూర్: బీసీలకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో పర్యటించి సోమవారం మాజీ సర్పంచ్ ఉత్కం హన్మంత్ గౌడ్‌తో పాటు గౌడ సంఘం సభ్యులు కాంగ్రెస్ చేరగా, వారికి పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో బీసీలను పూర్తిగా విస్మరించిందన్నారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, వైస్‌చైర్మన్ ఇట్టెడి మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నర్సింగ రావు

ఘనంగా దొంగమల్లన్న జాతర

మండలంలోని చిట్టాపూర్‌లో సోమవారం దొంగమల్లన్న జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ముఖ్య ఆతిథిగా కాంగ్రెస్ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

యుద్ధభేరి విజయవంతం చేయాలి

ధర్మపురి: హైదరాబాద్‌లో మార్చి 2న తలపెట్టిన యూపీఎస్‌పై యుద్ధబేరిని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటర్ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. సీపీఎస్ వద్దు పాత పెన్షన్ ముద్దంటూ ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం యుద్ధబేరి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు

కథలాపూర్: హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద జరిగిన ధర్నాకు మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు సోమవారం తరలివెళ్లారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులపై ఎంసీఐ చేస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు బ్యాగరి నర్సింహులు, బత్తుల అశోక్, మణికంఠ, కిశోర్,తదితరులు పాల్గొన్నారు.

నియామకం

అర్ధగణాంక శాఖ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

జగిత్యాల: అర్ధగణాంక శాఖ జగిత్యాల జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపత్, కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా శ్రీలత, ఉపాధ్యక్షురాలుగా శిరీష, కార్యనిర్వహణ కార్యదర్శులుగా రాణప్రతాప్, కార్యవర్గ సభ్యులుగా నరేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ, అర్ధగణాంక శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో కోశాధికారి సాహెద్‌బాబు, మహమూద్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజేహెచ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగాధర్

జగిత్యాల: జగిత్యాల జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజేహెచ్-143 ప్రధాన కార్యదర్శిగా కొడిమ్యాల మండలానికి చెందిన అడ్లగట్ట గంగాధర్ ను నియామిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సోమవారం అల్లం నారాయణ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గంగాధర్‌ను కొడిమ్యాల మండల నాయకులు,తోటి మిత్రులు అభినందించారు.

ఈద్గా కమిటీ అధ్యక్షుడిగా జమీల్ అహ్మద్

జగిత్యాల: జగిత్యాల ఈద్గా కమిటీ అధ్యక్షుడిగా జమీల్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సెంట్రల్ ముస్లిం కమిటీ సమావేశం జరుగగా కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సమాచారం

నేడు వాహనాల వేలం

జగిత్యాలక్రైం: జగిత్యాల ఎక్సైజ్ పరిధిలో మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్ తెలిపారు. జగిత్యాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 16 వాహనాలను ధరూర్ క్యాంప్‌లో ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

దుకాణాల ఏర్పాటుకు రేపు వేలం పాట

పెగడపల్లి: పెగడపల్లి స్వయంభూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దుకాణాల ఏర్పాటు కోసం ఈ నెల 12న బుధవారం ఆలయం ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయ, లడ్డు, పులిహోర విక్రయాల కోసం వేలం పాటలు నిర్వహిస్తామని, ఉదయం 10 గంటలకు వేలం పాట జరుగుతుందని ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

13న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

మల్యాల: మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. వార్డుల వారీగా ప్రచురించిన ఓటర్ల జాబితా అభ్యంతరాలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు ఎడ్లబండ్ల పోటీలు

బుగ్గారం: నియోజకవర్గంలోనే అత్యంత వైభవంగా నిర్వహించే బుగ్గారం ముత్యాల పోచమ్మ,నల్లపోచమ్మ జాతరలో రేపు ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య తెలిపారు. బుధవారం ఉదయం పోటీల నిర్వహణ ప్రారంభమవుతుందని తెలిపారు.